క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): కలెక్టర్ హరినారాయణ న్‌ను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకు మార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. వీరి చలపతి, నిరంజన్‌బాబురెడ్డి, రాధాకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీతో పలువురి భేటీ



నెల్లూరు(క్రైమ్): ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డీటీసీ చందర్ మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

నేత్రదానం



సుబ్బారెడ్డి (ఫైల్)

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టకు చెందిన సుబ్బారెడ్డి (63) సోమవారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



నెల్లూరు (అర్బన్): నవాబుపేటలోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో వంద మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. వెంకటేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టామని ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్యాణి తెలిపారు. సభ్యులు రేణుక మహేష్, స్పందన, రాధమ్మ, రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

చెడుగుడు పోటీల విజేత కోవూరు



కోవూరు: స్థానిక దళితవాడలో రెండ్రోజులుగా జరుగుతున్న తువ్వర పుల్లయ్య మెమోరియల్ జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో కోవూరు జట్టు విజేతగా నిలవగా, సోమరాజుపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. ముదివర్తి తృతీయ, యల్లాయపాళెం నాల్గోవ, కోవూరుకు చెందిన మన్నెం సునీల్ జట్టు ఐదోస్థానంలో రాణించాయి. విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పీ లవ్‌కుమార్, వెంకటరమణారెడ్డి, సువర్ణమ్మ, జయప్రకాశ్, ఫిజియోథెరపిస్ట్ తువ్వర రవితేజ, రాజ్‌కుమార్, జాన్సన్, అమర్, జ్యోతి, విజయ్‌కుమార్, సింహాద్రి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి ఆర్థిక సాయం

కొడవలూరు: మిక్కిలింపేటకు చెందిన గీత కార్మికుడు ఉప్పాల వెంకటేశ్వర్లుకు జిల్లా గౌడ సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షుడు తోట ప్రభాకర్ సోమవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. వెంకటేశ్వర్లు చెట్టుపై నుంచి జారిపడి గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా తోట ప్రభాకర్ మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కోసూరు గోవిందయ్య ఎంతో మంది గీత కార్మికులను ఆదుకున్నారని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కోవూరు రాజశేఖర్ గౌడ్, కార్యదర్శి దాసరి వెంకటేశ్వర్లు, కోశాధికారి కోసూరు గోవింద్, సంఘ కార్యదర్శి అల్లూరు ప్రశాంత్, సభ్యులు వాకా బ్రహ్మానాయుడు, మడపర్తి మల్లికార్జున, తిరకాల రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

1.13 కోట్ల పని దినాలే లక్ష్యం

మనుబోలు: 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1.13 కోట్ల పని దినాలను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని డ్వామా పీడీ వెంకట్రావ్ తెలిపారు. మండలంలోని పిడూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం పరిశీలించారు. నిత్యం జిల్లాలో 1.20 కోట్లు, మండలంలో 2,600 పని దినాలను లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. వేసవిలో కూలీలకు సరాసరి రూ.272 కూలి అందేలా చూడాలన్నారు. కూలీలకు తాగునీరు, ఇతర వసతులు కల్పించాలన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



రోడ్డు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నిత్యం ప్రజల మధ్యే తిరుగుతూ.. సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఏడో డివిజన్లోని వెంగమాంబ సెంటర్, చాకలివీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. చాకలివీధిలో నిర్మించనున్న రోడ్డు, డ్రెయిన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 90 శాతం సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని చెప్పారు. నగరంలో చెత్త పన్ను పేదలకు లేకుండా తొలగించామని తెలిపారు. పెద్ద ఇళ్లకు సైతం చెత్త పన్నును రూ.90 నుంచి రూ.30కు తగ్గించామన్నారు. కార్పొరేటర్ మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని బాబా మియా మసీదులో ప్రార్థనలను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తొమ్మిదో డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద వైద్య శిబిరం



నెల్లూరు(అర్బన్): కలెక్టరేట్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించే తిక్కన భవన్ వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రత నేపథ్యంలో శిబిరాన్ని నిర్వహించారు. ఉద్యోగులతో పాటు ప్రజలకు బీపీ, తదితర పరీక్షలు చేశారు. వడదెబ్బ తగలకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురికి మందులను అందజేశారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా స్థలాన్ని కాపాడాలని వినతి



నెల్లూరు(అర్బన్): ఆక్రమణకు గురవుతున్న సంతపేటలోని 1.8 ఎకరాల ఈద్గా స్థలాన్ని కాపాడాలని ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జియా ఉల్ హక్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రాన్ని కలెక్టరేట్లో సోమవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. స్థలాన్ని కొందరు ఆక్రమించి కట్టడాలను చేపట్టారని ఆరోపించారు. ఈద్గా స్థలాన్ని కాపాడి అందులో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని కోరారు. అబ్బాస్ అలీఖాన్ మసీదు స్థలం, మసీదు నిర్మాణానికి రూ.8 లక్షలను వక్ఫ్ బోర్డు మంజూరు చేసిందని, పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలని విన్నవించారు. జేఏసీ రాష్ట్ర నేత అబ్దుల్ అజీజ్, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు రషీద్, నేతలు ఉమర్, షాహుల్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమావేశం రేపు



నెల్లూరు (పొగతోట): ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచ్‌ల సదస్సును నగరంలోని మినర్వా గ్రాండ్‌లో బుధవారం నిర్వహించనున్నామని సర్పంచ్‌ల సంఘ కన్వీనర్ శివకుమార్, కార్యనిర్వాహకుడు నాగేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో విలేకరుల సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. సర్పంచ్‌ల సమస్యలపై చర్చించనున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

‘శ్రీనికేతన్’ వార్షికోత్సవ సంబరాలు



నెల్లూరు (టౌన్): జొన్నవాడ రోడ్డులోని శ్రీనికేతన్ పాఠశాల వార్షికోత్సవ సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్య అతిథిగా సినీ నటుడు భానుచందర్ హాజరయ్యారు. అనంతరం ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు గ్రాడ్యుయేషన్, మెరిట్ సర్టిఫికెట్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. సౌత్‌మోపూరు కళాశాల డెవలప్‌మెంట్ చైర్మన్ పెంచలయ్య, కరస్పాండెంట్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డిని సెక్రటేరియెట్‌లోని ఆయన చాంబర్‌లో ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. వైఎస్సార్ జిల్లా యర్రగుంట్లలో పదో తరగతి చదివే రోజుల్లో తాము క్లాస్‌మేట్స్ అని వెంకటసుబ్బయ్య గుర్తుచేసుకున్నారు.

దరఖాస్తులకు 24 తుది గడువు



మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): ఏపీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి సంబంధించిన పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని గండిపాళెం గురుకుల విద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఆసక్తి గల వారు aprs.apcfss.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంఘ సభ్యులు కిషన్‌కుమార్, కిరణ్‌కుమార్, రమేష్, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో మేయర్ తనిఖీ



సమస్యలను ఆరాతీస్తున్న స్రవంతి

నెల్లూరు రూరల్: అర్హులకు సంక్షేమ పథకాలను సజావుగా అందించేలా వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది కృషి చేయాలని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. అల్లీపురంలోని సచివాలయాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని, వీటిని పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జనార్దన్‌రెడ్డికాలనీలోని సబ్‌స్టేషన్‌ను ఆధునికీకరించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మంగళవారం ఉండదని నెల్లూరు టౌన్ – 2 డీఈఈ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం, గాంధీగిరిజన కాలనీ, జనార్దన్‌రెడ్డి కాలనీ, భగత్ సింగ్ కాలనీ, టిడ్కో గృహ సముదాయం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• డీఎస్సార్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ జెడ్పీ కాలనీ, గౌతమినగర్ ఫీడర్లలో టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో నేతాజీనగర్, జెడ్పీ కాలనీ, పొదలకూరు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ



నెల్లూరు(క్రైమ్): అప్రమత్తతతో అగ్నిప్రమాదాలను నియంత్రించొచ్చని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అగ్నిప్రమాదాల నియంత్రణ, చేపట్టాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలోని గ్రీన్ హౌస్ ఆగ్రో లిమిటెడ్ రొయ్యల కంపెనీలో సోమవారం నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో వివిధ అంశాలపై డెమో చూపారు. నెల్లూరు అగ్నిమాపక అధికారి జాషువా, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన జీజీహెచ్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. రాపూరుకు చెందిన పుల్లయ్య (44) భార్య కొంతకాలం క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి పుల్లయ్య మద్యానికి బానిస కావడంతో పాటు టీబీ వ్యాధికి గురయ్యారు. జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన పుల్లయ్య ఆస్పత్రి బయటే రోడ్డుపై కళ్లు తిరిగిపడిపోయి మృతి చెందారు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన వివరాల ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు శివయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ సిబ్బందికి వాటర్ బాటిళ్ల పంపిణీ

నెల్లూరు(క్రైమ్): ఎండల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది దాహార్తిని తీర్చేందుకు హబీబుల్లాపేటలోని రూత్ మినిస్ట్రీస్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆత్మకూరు బస్టాండ్ నుంచి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు రోడ్లపై విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి వాటర్ బాటిళ్లను సోమవారం పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ ఫిలిక్స్ రాజ్‌కమల్, సిబ్బంది విజయ్, సుధీర్, సుమన్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

భగవద్రామానుజాచార్యులుకు పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో భగవద్రామానుజాచార్యులు అవతార మహోత్సవాలను విశేషంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామివారికి పలు పూజలు చేశారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా రేపు

నెల్లూరు(మినీబైపాస్): జాబ్‌మేళాను బుధవారం నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి సురేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలాజీ ఏజెన్సీస్, అశోక్ లేలాండ్ వెహికల్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు గానూ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని చెప్పారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా (ఎలక్ట్రీషియన్స్, మోటార్.. డీజిల్ మెకానికల్) చదివిన 21 నుండి 35 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. అకౌంటెంట్స్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్, కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ మేనేజర్, ఫ్లోర్ క్వాలిటీ కంట్రోలర్, మెకానిక్, ఎలక్ట్రీషియన్, హెల్పర్, తదితర ఉద్యోగాలను భర్తీ చేయనున్నారని వివరించారు. ఆసక్తి గల వారు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

కళాశాల ఎదుట ఆందోళన

నెల్లూరు రూరల్: కనుపర్తిపాడు సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల ఎదుట ఆందోళనను బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడారు. కళాశాల యాజమాన్య నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థిని మృతి చెందిందని ఆరోపించారు. విద్యార్థి మృతికి కారకుడైన డ్రైవర్‌పై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

దివ్యాంగుల ఆశ్రమంలో అన్నదానం

నెల్లూరు (పొగతోట): వేదాయపాళెంలోని స్వర్ణదీపం దివ్యాంగుల ఆశ్రమం, జీజీహెచ్‌లో అన్నదాన కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. దేవినేని నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకొని రాజేష్ యువసేన ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళి



నెల్లూరు(బృందావనం): మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతిని గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాయప్ప ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రైల్వేఫీడర్స్ రోడ్డులోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఎంఈఓ తిరుపాల్, రమేష్, రమణయ్య, సుబ్బారావు, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో సంతోషంగా ప్రజలు



సంక్షేమ పథకాలపై బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 17వ డివిజన్లోని గుండ్లపాళెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. ప్రతి ఇంట్లో ఏదో ఒక పథకాన్ని పొందారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించి, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాలని కోరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్ సుధాకర్, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, మర్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో బాధ్యతగా వ్యవహరించాలి



సమస్యలను తెలుసుకుంటున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్జీలకు పరిష్కారాన్ని చూపాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, మేనేజర్ ఇనాయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఇందూ ధర్మ ప్రచారం



నెల్లూరు(బృందావనం): మూలాపేట, నీలగిరి సంఘం, తదితర ప్రాంతాల్లో ఇందూ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి మాట్లాడారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచార కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. రత్నం, సుధాకర్ ఆచారి, నరసింహప్రసాద్, సునీల్, నరసారెడ్డి, పద్మజ, మనోజ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు చేయూత



నెల్లూరు (అర్బన్): ఇళ్లు కాలిపోయిన గిరిజన కుటుంబాలను రెడ్‌క్రాస్ సంస్థ ఆదుకుంది. 12వ డివిజన్లోని మంగళదిబ్బ వద్ద మూడు గిరిజన కుటుంబాలకు చెందిన ఇళ్లు అగ్ని ప్రమాదానికి గురవడంతో వారిని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ పరామర్శించింది. టార్పాలిన్ పట్టలు, దుప్పట్లు, వంట సామగ్రి, నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు రంగయ్యనాయుడు, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మినహాయింపునివ్వాలని వినతి



డీఈఓకు వినతిపత్రమిస్తున్న పీఆర్టీయూ నేతలు

నెల్లూరు (టౌన్): కందుకూరు డివిజన్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదో తరగతి మూల్యాంకనం నుంచి మినహాయింపునివ్వాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటరాజు, ప్రధాన కార్యదర్శి తిరుమలయ్య కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవానికి వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. జిల్లా కేంద్రానికి కందుకూరు దూరంగా ఉన్న తరుణంలో మినహాయింపునివ్వాలని విజ్ఞప్తి చేశారు.